27న వైద్య శాఖ ఉద్యోగుల స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 27న ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. స్పందన కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. సిబ్బంది తమ జీతాల సమస్యలపై ఆర్జీలను సమర్పించవచ్చని పేర్కొన్నారు.

పల్లె పొమ్మంటుంది... పట్టణం రమ్మంటోంది

ఉన్న ఊరులో ఉపాధిలేక వలసబాట పట్టిన గిరిజనం

నిడగల్లుగూడ నుండి పక్క రాష్ట్రానికి వలస వెళ్తున్న వ్యవసాయ కూలీలు

జిల్లాలో వలసలు ఆగడం లేదు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవలేదు. పంటలు ఎండిపోవడంతో గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికి తోడు చింతపంట పూర్తిగా పోయింది. జీడి పువ్వు దశలో రాలిపోయి జీడి చెట్లకు అనేక రకాల తెగుళ్లు రావడంతో జీడి పంట కూడా వచ్చే అవకాశం లేదు. ఉపాధి హామీ పనికి వెళ్దామంటే సక్రమంగా పనుల్లేవు. ఒకవేళ పని ఉన్నా వేతనాలు సకాలంలో పడడం లేదు. దీంతో వేరే గత్యంతరం లేక పొట్టకూటి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో గిరిజన రైతులు, వ్యవసాయ కూలీలు వలసలు వెళ్తున్నారు. నివారించాల్సిన అధికారులు, పాలకులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

ప్రజాశక్తి - కురుపాం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది మొదటి నుంచీ వర్షాలు సక్రమంగా కురవపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వచ్చిన అరకొర వర్షాలకు ఖరీఫ్ సీజన్లో అప్పో, సప్పో చేసి రైతులు పంటలను సాగు చేశారు. పంటలు విత్తినప్పటి నుంచి వర్షాలు కురవలేదు. పంటలు ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు అల్లాడుతున్నారు. పంటలకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక గిరిజన రైతులు కృంగిపోతున్నారు. దీంతో పట్టణాల్లో పనులు చేసుకోవడానికి గిరిజన రైతులు, వ్యవసాయ కూలీలు సిద్ధమయ్యారు. కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో వబ్బంగి, నీలకంఠాపురం, తిత్తిరి తదితర పంచాయతీలల్లో గల వబ్బంగిగుడా, పీరుంగుడా, కాకిలి తీయాలి, నిడగల్లుగూడ తదితర గిరిజన గ్రామాలకు చెందిన గిరిజన రైతులు, వ్యవసాయ కూలీలు వాహనాలను బాడుగకు తీసుకొని గృహాలకు తాళాలు వేసి వంట సామగ్రి, బట్టలు సర్దుకుని వలస వెళ్లారు.

తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మొక్కజొన్న, మిరప, పత్తి పంటలు బాగా ఉన్నాయని, అలాగే కొన్ని ఫ్యాక్టరీల్లో అక్కడ కూలి పనులు చేసుకోవడానికి వెళ్తున్నట్లు కూలీలు తెలిపారు. 'మేము సాగు చేసిన పంటలన్నీ వర్షాల్లేక ఎండిపోయాయి. వాటి కోసం అప్పులు చేసుకున్నాం. ఆ అప్పులు తీర్చడానికి, మా కడుపులు నింపుకోవడానికి, జీవనం కొనసాగించడానికి వలస వెళ్లక తప్పడంలేదు' అని తీవ్ర మనోవేదన వ్యక్తం చేశారు. రైతులు, కూలీలు వలస వెళ్లకుండా ప్రభుత్వం ఏ చర్యలూ చేపట్టకపోవడం శోచనీయం. ప్రతి ఏడాది పంటల సాగుకు చేసిన అప్పులే వడ్డీలకు వడ్డీ కట్టలేకపోతున్నామని, ఈ ఏడాదైనా పంటలు బాగా వస్తే అప్పులు తీర్చుదామని రైతులు భావించారు. ఈ ఏడాది కూడా వర్షాల్లేక, కరువును జయించలేక పరిస్థితి తమకు ఎప్పుడు పోతుందోనని కూలీలు వాపోయారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా గిరిజన రైతుల జీవితాలు మారడం లేదు. రాబోయే రోజుల్లో చాలా గ్రామాల్లో మరిన్ని వలసలు పెరిగే అవకాశం ఉందని ప్రజలే చర్చించుకుంటున్నారు. తీవ్ర కరువుతో అల్లాడుతున్న గిరిజన రైతులకు, వ్యవసాయ కూలీలకు శాశ్వత పరిష్కారం చూపాలని గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాలను కోరుతున్నారు.

వలసలు వెళ్లకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిది

వర్షాభావ పరిస్థితులతో పంటలు చేతికి రాక పక్క రాష్ట్రాలకు రైతులంతా వలస వెళ్లి అక్కడ వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ వలసలను ఆపాలంటే తక్షణమే ప్రభుత్వం కరువు మండలాల్లో అదనపు ఉపాధి పనులు కల్పించి, వెంటనే వేతనాలు కూడా చెల్లించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. అప్పుడే వలసలు ఆగుతాయి.

- ఎం.అడ్డమేశ్వరరావు, సిపిఎం నాయకులు, వబ్బంగి పంచాయతీ

వలసలకు తోవ లేకుండా పనులు కల్పిస్తాం

మండలంలో ఏ గ్రామంలోనైనా సరే పంటలు పాడైపోయి వలసలు పోయే వారికి అదనంగా ఉపాధి పనులను కల్పిస్తాం. ఏ ఒక్కరూ వలసలు వెళ్లడానికి తావు లేకుండా చూసుకుంటాం. ఇప్పటి వరకు అధికారికంగా వలసలు మా దృష్టికి రాలేదు.

పి. బావాజీ, ఎపిఒ.

నాలుగు నెలలుగా డ్రైవర్లకు అందని జీతాలు

- నిలిచిపోయిన అద్దె బస్సులు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం : డిఎం

ప్రజాశక్తి - సాలూరు

అసలే అరకొర జీతం, తుమ్మితే ఊడిపోయే ఉద్యోగం, బస్సు ఎక్కితే దిగే వరకూ ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి. రోజుకు వెయ్యి చొప్పున నెలకు రూ.15వేలు జీతం. 15రోజులే ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లకు నాలుగు నెలలుగా జీతాలు అందలేదు. దీంతో వారు గత ఐదురోజులుగా అద్దె బస్సులను నడపకుండా వదిలేశారు. ఫలితంగా స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో గ్రామీణ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. డిపో పరిధిలో సుమారు 13 అద్దె బస్సులు నిలిచిపోయాయి. ఇవన్నీ పల్లె వెలుగు బస్సులే. మారుమూల గ్రామాలకు వెళ్లాల్సిన బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె బస్సుల్లో డ్రైవర్లకు ప్రయివేటు యజమాని జీతాలు చెల్లిస్తారు. కండక్టర్ మాత్రమే ఆర్టీసీ సంస్థకు చెందిన ఉద్యోగి. డిపో పరిధిలో ఉన్న మొత్తం బస్సు సర్వీసుల్లో ఎక్కువ అద్దె బస్సు సర్వీసులే వున్నాయని తెలుస్తోంది. విజయనగరానికి చెందిన ఓ కాంట్రాక్టరుకు చెందిన అద్దె బస్సులు డిపోలో ఎక్కువగా వున్నాయి. ఈ బస్సు డ్రైవర్లకు నాలుగు నెలలుగా జీతాలందకపోవడంతో విధులు నిర్వహించలేమని వారు డిపో యాజమాన్యానికి తెగేసి చెప్పారు. దీంతో డిపో మేనేజర్ కాంట్రాక్టరును రప్పించి డ్రైవర్ల జీతాల సమస్య పరిష్కరించాలని ఒత్తిడి పెంచారు. కాంట్రాక్టరు జీతాలపై డ్రైవర్లకు హామీ ఇచ్చారు. అయితే కాంట్రాక్టరు చెప్పిన గడువులోగా జీతాలు చెల్లించకపోవడంతో డ్రైవర్లు విధులు బహిష్కరించారు. ఫలితంగా డిపో పరిధిలో ఉన్న 13 అద్దె బస్సులు నిలిచిపోయాయి. చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. నిలిచిన సర్వీసులన్నీ గ్రామీణ ప్రాంత సర్వీసులు కావడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రజలు అధిక అధిక మొత్తంలో ఛార్జీలు వెచ్చించి ప్రయివేటు వాహనాలపై ప్రయాణించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

నిలిచిపోయిన అద్దె బస్సులు

ప్రత్యామ్నాయ చర్యలేవీ?

నాలుగు రోజులుగా అద్దె బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ఆర్టీసీ యాజమాన్యం చోద్యం చూస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిపో మేనేజర్ కాంట్రాక్టరును రప్పించి డ్రైవర్లతో చర్చలు జరిపినా సమస్య కొలిక్కి రాలేదు. డిపో పరిధిలో 76 బస్సు సర్వీసులు వున్నాయి. వీటిలో సుమారు 31 అద్దె బస్సు లేనని తెలుస్తోంది. డిపో పరిధిలో ఉన్న ఆర్టీసీ బస్సులను ఇతర డిపోలకు తరలిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో డిపోను అద్దె బస్సులతో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపి మొత్తం బస్సు సర్వీసులు తిరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి : భాస్కరరెడ్డి, డిపో మేనేజర్

అద్దె బస్సు డ్రైవర్లు, కాంట్రాక్టరు మధ్య జీతాల సమస్య కారణంగా 13 బస్సులు నిలిచిపోయాయి. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కావొచ్చు. కాంట్రాక్టరు, డ్రైవర్ల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

శోకసంద్రంలో విద్యార్థి బంధువులు (ఇన్‌సెట్‌లో మృతుడు వంశీ ఫైల్‌ఫొటో)

రాలిన విద్యా కుసుమం

మరో గిరిజన విద్యార్థి మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏదో ఒక కారణంతో ఒకరి తర్వాత ఒకరు మృత్యువు ఒడికి చేరుతూనే ఉన్నారు. తమ పిల్లలను బాగా చదివించాలని, ఉన్న స్థానంలో ఉంచాలనే తల్లిదండ్రుల ఆశలు ఆవిరైపోతున్నాయి. చదువుకునే పసిప్రాయంలో విద్యార్థులు మృతి చెందడంతో తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నాయి. జిల్లాలో ఒకే నెలలో ఆరుగురు విద్యార్థులు మృతి చెందడం అత్యంత బాధాకరం. విద్యార్థుల మరణాల గల కారణాలను విశ్లేషించడంలో అధికారుల పాత్ర అంతంత మాత్రంగానే ఉందని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అందుచేతనే విద్యార్థుల మరణాలు ఆగడంలేదని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలో మరో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ...

మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న తాడంగి వంశీ (రిజిస్టార్‌లో చంటి) గిరిజన విద్యార్థి శుక్రవారం అర్ధరాత్రి తన స్వగ్రామైన తెన్నుఖర్జలో ఇంటి వద్ద మృతి చెందాడు. తల్లిదండ్రులు, వార్డెన్ చెప్పిన వివరాల మేరకు గ్రామంలో పూజ ఉందని విద్యార్థి తండ్రి తాడంగి శ్రీను శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వంశీని ఇంటికి తీసుకెళ్లాడు. ఎప్పట్లాగానే వంశీ రాత్రిపూట భోజనం చేసి తలనొప్పిగా ఉందని చెప్పి పడుకున్నాడు. రాత్రి 11గంటల తర్వాత లేచి తనకు ఆకలిగా ఉందని అన్నం పెట్టాలని తల్లి సత్యవతిని అడగడంతో మళ్లీ అన్నం పెట్టింది. అన్నం తిన్న తర్వాత నీరు తాగాడని ఆ తాగిన నీరు వెంటనే ముక్కు, నోటు నుంచి బయటకు వచ్చిందన్నారు. కొద్దిసేపటికే కాళ్లు, చేతులు వంకరగా అయిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయడని తెలిపారు. వెంటనే 108 ఫోన్ చేశామని వారు వచ్చి చూసేసరికి వంశీ మృతి చెందినట్లు నిర్ధారించారని అన్నారు. నాలుగో తరగతి నుంచి టిక్కబాయి పాఠశాలలో చదువుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఇంత అకస్మాత్తుగా తన బిడ్డ దూరమవుతాడని అనుకోలేదని విలపించింది.

విద్యార్థుల మరణాలు బాధాకరం

సకాలంలో వైద్యమందక గిరిజన విద్యార్థులు చనిపోతున్నారని, విద్యార్థులు మరణాలు బాధాకరమని భారత్ ఆదివాసీ పార్టీ ఉపాధ్యక్షులు ఆరిక నీలకంఠం అన్నారు. ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడారు. భద్రగిరి పిటిజిలో చదువుతున్న ఏడో తరగతి విద్యార్థిని బిడ్డిక శృతికి మంచి వైద్యం అందని కారణంగానే మృతి చెందిందని అన్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందకపోవడంతోనే చాలామంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతూ మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల మరణాలకు గల కారణాలు తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

రాజన్నదొర నోట ఎంపి మాట

- వ్యూహాత్మకమా? ఉద్దేశ పూర్వకమా?
- అరకు ఎంపి సీటు రేసులో స్వాతీరాణి
- పార్టీ శ్రేణుల్లో తర్జన భర్జనలు



ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొర నోటి వెంట మళ్లీ ఎంపీ సీటు మాట తెరపైకి రావడం పార్టీ శ్రేణుల్లో సరికొత్త చర్చకు తెరలేపింది. గత కొంతకాలంగా ఆయన అప్పుడప్పుడు కాకతాళీయంగా ఎంపి కావాలన్న కోరికను వ్యక్తపరుస్తూ వస్తున్నారు. అయితే ఎంపిగా పోటీ చేయాలనే కోరిక మాత్రం ఆయన మనసులో బలంగా ఉంది. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించిన ఆయన డిప్యూటీ సిఎం స్థాయి వరకు ఎదిగారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎంపిగా పోటీ చేయడమే మంచిదనే నిర్ణయానికి ఆయన వచ్చినట్లు తెలుస్తోంది. దీనికి తన వ్యక్తిగత సమస్యలతో పాటు రాజకీయ కారణాలు కూడా ఉండొచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. గతకొద్ది నెలలుగా ఆయన కొన్ని అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. గుండెకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పూర్తి స్థాయిలో రాజకీయాలపై దృష్టి సారించలేనేమోనన్న భయం వెంటాడుతోంది. ఎమ్మెల్యేగా పోటీ చేస్తే నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తల మధ్య అభిప్రాయబేధాలను పరిష్కరించాల్సి వుంటుంది. ఎన్నికల ముందు కొంతమంది నాయకులు బెదిరింపులు, అదిరింపులకు దిగే అవకాశం ఉంది. అలాంటి వారిని బుజ్జగించి దారిలోకి తెచ్చుకునే ప్రయత్నాలు చేపట్టాల్సిన అవసరం ఉంటుంది. ఇలాంటి అంశాలపై దృష్టి పెట్టాలంటే వందశాతం ఆరోగ్యంగా ఉండాలనేది ఆయన అభిప్రాయం. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామ, మండల స్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టి ఒత్తిళ్లకు గురై ఎమ్మెల్యేగా పోటీ చేయడం కన్నా ఎంపీగా పోటీ చేస్తే వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి కొంత సమయం దొరుకుతుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొద్ది రోజుల క్రితం ఆయన ఎంపిగా పోటీ చేయాలనే కోరికను బయటపెట్టారు. మండల వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎంపీగా పోటీ చేయాలనే అభిప్రాయాన్ని ఉద్దేశపూర్వకంగానే చెప్పినట్లు అనిపించింది. సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశిస్తే ఎంపిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. అయితే అధిష్ఠానం దేనికి పోటీ చేయమంటే దానికి చేస్తానని కూడా చెప్పారు. అరుకు ఎంపి నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో ఆరు ఎస్టీ, ఒక ఎస్సీ నియోజకవర్గం ఉండడంతో విజయం సునాయాసమవుతుందనే అభిప్రాయం ఆశావహుల్లో ఉంది. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా ఈ సారి అరుకు ఎంపీ సీటును బిజెపి ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో వైసిపి ఎంపి అభ్యర్థిగా పోటీ గెలిచిన మాజీ ఎంపి కొత్తపల్లి గీత ప్రస్తుతం బిజెపిలో ఉన్నారు. ఆమె 2014లో వైసిపి ఎంపీగా గెలుపొందారు. ఇప్పుడు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉన్న కొత్తపల్లి గీత ఎంపీగా పోటీ చేయాలనే యోచనలో వున్నారు. టిడిపి, బిజెపి రాష్ట్ర నాయకులతో ఆమెకు సత్సంబంధాలు ఉండడంతో ఎంపి సీటు ఆమెకు దక్కుతుందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి ఎంపి అభ్యర్థిగా ఎవరు పోటీ చేసినా గెలుపు సునాయాసమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిలో భాగంగానే రాజన్నదొర ఎంపి పల్లవి అందుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎంపిగా పోటీ చేసి గెలిస్తే వ్యక్తిగత అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి సమయం దొరుకుతుందని, ఆరోగ్య సమస్యల నుంచి కొంత ఉపశమనం లభిస్తుందనే ఆలోచనతో రాజన్నదొర ఉన్నట్లు సమాచారం. ఆయన నోటి వెంట మళ్లీ ఎంపీ మాట రావడం వెనుక వ్యూహాత్మక అడుగులతో పాటు ఉద్దేశపూర్వకమైన అభిప్రాయం కూడా వుందని స్పష్టమవుతోంది.

దొర ఎంపిగా వెళ్తే ఎమ్మెల్యే ఎవరో?

ఒకవేళ అరుకు ఎంపి అభ్యర్థిగా డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఎంపిక చేస్తే ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారనే చర్చ మొదలైంది. ప్రస్తుతానికి ఎంపి సీటు రేసులో జిసిసి చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతీరాణి ఉన్నారు. మొదటి నుంచి ఎంపి టికెట్ కావాలని ఆమె ఆశిస్తున్నారు. అయితే కొద్ది రోజుల క్రితం ఎంపి అభ్యర్థిగా పాడేరు సిట్టింగ్ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని పార్టీ ప్రకటించింది. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా భాగ్యలక్ష్మిని తప్పించి వేరొకరికి సీటు ఇస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో మొదటి నుంచి సీటు ఆశిస్తున్న ఎస్టీ భగత సామాజిక వర్గానికి చెందిన నాయకులు స్వాతిరాణి రేసులో ఉన్నారు. ఇప్పుడు అదే రేసులోకి రాజన్నదొర కూడా చేరడంతో సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనేదానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఒకవేళ రాజన్నదొర ఎంపిగా వెళ్తే తనకు సాలూరు ఎమ్మెల్యే సీటు కావాలని కూడా స్వాతీరాణి కోరుతున్నారు. స్వాతిరాణి భర్త గుల్లిపిల్లి గణేష్‌ది సాలూరు కావడంతో పాటు నియోజకవర్గంలో ఆయనకు బలమైన సామాజిక సంబంధాలు వున్నాయి. ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేసిన స్వాతిరాణికి మన్యం జిల్లాతో పాటు, నియోజకవర్గంలో ప్రధాన పార్టీల నాయకులతో పరిచయాలు ఉన్నాయి. తాజా పరిస్థితుల్లో తాను ఎమ్మెల్యేకైనా పోటీకి సిద్ధమేనన్న సంకేతాలు పంపించారు. ఇదిలా ఉండగా నియోజకవర్గ పరిధిలో గల పాచిపెంట ఎంపిపి బి.ప్రమీల పేరును కూడా ఆయన సూచించే అవకాశాలు ఉన్నాయి. ప్రమీల ఉన్నత విద్యావంతురాలు, రాజకీయాల పట్ల అవగాహన ఉన్న గిరిజన నాయకురాలిగా గుర్తింపు ఉంది. ఆమె భర్త నియోజకవర్గంలో ప్రధాన సామాజికవర్గానికి చెందిన నాయకుడు కావడం అనుకూల పరిణామంగా కనిపిస్తోంది. అయితే తాను ఎంపీగా వెళ్తే ఎమ్మెల్యే సీటు విషయంలో రాజన్నదొర ఎవరికి సిఫార్సు చేస్తారనే చర్చ కూడా తెరపైకి వస్తోంది. ఒకవేళ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికపై సలహా అడిగితే ఆయన ఎవరి పేరు సూచిస్తారనేది చర్చనీయాంశమవుతోంది.

బొబ్బిలి.. రాజా కళాశాల కేంద్రం వద్ద అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

83.57 శాతం మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో 80 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన పరీక్ష ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో సత్య ఇంజనీరింగ్ కళాశాల, గాయత్రీ కళాశాల, ఆర్.కె.డిగ్రీ కళాశాల తదితర పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తనిఖీ చేశారు. మొత్తం 25,181 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 21,043 మంది (83.57 శాతం) అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్టు డిఆర్ఓ ఎస్.డి.అనిత వెల్లడించారు. నగరంలోని గాయత్రీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 94.58 శాతం అత్యధిక హాజరు నమోదుకాగా, గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 61.46 శాతం అత్యల్ప హాజరు నమోదైంది.

విజయనగరంకోట : నగరంలోని ఎంఎస్ఎన్, శ్రీచైతన్య, పిఎస్ఆర్, ఆదిత్య పరీక్షా కేంద్రాలను ఎఎస్‌పి అస్మా ఫర్వీన్ సందర్శించారు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బొబ్బిలి : పట్టణంలో గ్రూపు-2 పరీక్ష ప్రశాంతం ముగిసింది. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు, పోలీసులు హాల్ టికెట్లు, ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులను పరిశీలించి అభ్యర్థులను లోపలికి అనుమతించారు. పట్టణంలో 18 కేంద్రాల్లో 4,825 మందికి గాను 3958 మంది హాజరయ్యారు.

ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా వైద్య సేవలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మేరకు పట్టణంలోని ఇప్పిలి వారి వీధి సందులో సంజీవిని ఆరోగ్య కేంద్రం పేరిట ట్రస్ట్ నిర్వాహకులు ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. డాక్టర్ వంశీ దాసరి అనే వైద్యులు ఈ కేంద్రంలో నిరుపేద రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి పట్టణ పార్టీ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు ఈ కేంద్రం ఏర్పాటును ఆదివారం పరిశీలించారు. త్వరలో ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనకు రానున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి ఈనెల 27న ఈ సంజీవిని ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కొనసాగిస్తున్న గిరిజనులు

గిరిజనులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పట్టాలిస్తామని చెప్పి గిరిజనులను మోసగించిన తహశీల్దార్, విఆర్ఒపై చర్యలు తీసుకొని ఆదివాసీ గిరిజనులకు న్యాయం చేయాలని గిరిజన సంఘం నాయకులు బర్ల అప్పారావు, వంతల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. తమకు పట్టాలివ్వాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపడుతున్న గిరిజనులకు అప్పారావు, వంతల లక్ష్మయ్య సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న బొర్రమామిడి, జిల్లేడువలస, గాదెలవలస గ్రామాల గిరిజనులకు పట్టాలిస్తామని చెప్పి ఒక గ్రామానికి పట్టాలు అందజేసి మిగతా గ్రామాల వారికి పట్టాలు ఇవ్వకుండా మోసం చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మిగతా గ్రామాలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

ఆశావహులకు తప్పని నిరాశే

గుమ్మలక్ష్మీపురం : రానున్న ఎన్నికల్లో కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థిగా తోయక జగదీశ్వరి పేరు ప్రకటించడంతో టికెట్ ఆశించిన పలువురి ఆశావాహులకు నిరాశ తప్పలేదు. జగదీశ్వరికి ఇన్చార్జి బాధ్యతలు ఇవ్వడాన్ని రెండోగ్రూపు వ్యతిరేకిస్తూ వచ్చింది. నాటి నుండి టిడిపిలో కొంతమంది రెండో గ్రూపుగా విడిపోయి ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్ర ప్రయత్నం చేశారు. మరోవైపు గ్రూపులు ఉండగానే కురుపాం మాజీ ఎంపి వైరిచర్ల ప్రదీప్‌దేవ్ కుమారుడు వీరేష్ చంద్రదేవ్ తెరపైకి వచ్చారు. ఈయన కూడా ఎమ్మెల్యే ఎంపి టికెట్ కోసం ఆశిస్తున్నారని కొంతవరకు ప్రచారం జరిగింది. జగదీశ్వరికి విజయరామరాజు ఆశీస్సులు, ఇన్‌ఛార్జిగా ఆమె చేసిన కృషి ఫలితంగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు టిక్కెట్ కేటాయించారు. కురుపాంలో ఎమ్మెల్యే టికెట్ ఎవరికి ఇచ్చిన అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అధిష్ఠానం సూచించినట్లు తెలిసింది. అయితే నేటి వరకు రెండు గ్రూపులను కలిపే ఆలోచన చేయకుండా జగదీశ్వరికి టిక్కెట్ కేటాయించారని రెండో గ్రూపు సభ్యులు తీవ్ర వ్యతిరేకతో ఉన్నారు. మరొకవైపు కోటతో సంబంధం లేకుండా బయటకు వస్తే కలిసి కట్టుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని బహిరంగనే చెబుతున్నారు. జగదీశ్వరికి శనివారం టిక్కెట్ కేటాయించిన రెండవ వర్గం ఆశావాహులు నేటి వరకు ఆమెను కలిసే ప్రయత్నాలు చేయలేదు. అధిష్టానం దీనిపై దృష్టి సారించి రెండు గ్రూపులను కలిపే మార్గం చూపకపోతే ఈ ఎన్నికల్లోనూ గ్రూపుల పోరు కొనసాగుతాయని పరిశీలకులు అంటున్నారు.

అడ్డంగూడ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఏజెన్సీ రోడ్లకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి తీసుకొస్తున్నామని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని చెముడుగూడ పంచాయతీ అడ్డంగూడకు రూ.40లక్షలతో 0.929 కిలోమీటర్ల దూరం నిర్మించిన బిటి రహదారి, డెప్పిగూడ వరకు రూ.140.00 లక్షలతో 2.285 కిలోమీటర్ల నిర్మించిన బిటి రహదారులను ఆదివారం ఆమె ప్రారంభించారు. రోడ్ల నిర్మాణంతో రవాణా సౌకర్యం, అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జెడ్పిటిసి రాధిక, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సంధ్యారాణి

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రానున్న ఎన్నికల్లో సాలూరు నియోజకవర్గం తెలుగుదేశం అభ్యర్థిగా గుమ్మడి సంధ్యారాణి పేరును అధిష్టానం ప్రకటించింది. దీంతో ఆమె మండలంలోని శివరాంపురంలో శివాలయంలో ఆదివారం పూజలు నిర్వహించి గ్రామంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం గ్రామంలో ప్రచారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సాలూరు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం అవసరమన్నారు. అన్యాయాలు, అక్రమాలపై మాట్లాడుతున్న వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని తమ గోడును చెప్పుకోవడానికి నిరుద్యోగ, ఉద్యోగ, కార్మికులకు ఎటువంటి అవకాశం ఈ రాష్ట్రంలో లేదని వీటన్నింటికీ ముఖ్యకారణం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని ఎంత తొందరగా ఓడిస్తే ఈ రాష్ట్రానికి అంత మంచిదని ఆమె చెప్పారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, నిమ్మాది తిరుపతి రావు, బూసి తేడు, అప్పికొండ రమాదేవి, యుగంధర్, భాస్కరరావు, వెంకటరమణ, తవిటి నాయుడు, బాలాజీ, కృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

27న తలవరంలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరంలో ఈనెల 27న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎస్.సాల్మన్‌రాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. వైద్య, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

నరేష్‌కుమార్‌కు డాక్టరేట్‌ను ప్రదానంచేస్తున్న అకాడమీ ప్రతినిధులు

నరేష్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - సాలూరు

మాతృభూమి సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షులు, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు పసుమర్తి నరేష్ కుమార్‌కు తమిళనాడులోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అకాడమీ గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. నరేష్ కుమార్ గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా అకాడమీ గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. గత కొంతకాలంగా ఆయన ఏజెన్సీ ప్రాంతంలో వైద్య శిబిరాలు నిర్వహించడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం చేస్తున్నారు.

నిర్మల కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బగ్గందొరవలసకు వైస్ సర్పంచ్ కోట్ల నిర్మల ఇటీవల అకాల మరణం చెందారు. ఈ మేరకు ఆమె కుటుంబాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మల కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం పొందేందుకు తను సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, శ్రీరాములునాయుడు, జెడ్పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, మండల వైసిపి అధ్యక్షులు చిట్టిరాజు, సర్పంచులు అధికార నాగభూషణం, ఎన్.రామకృష్ణ, ఎ.తిరుపతిరావు, కురుమల శ్రీనివాసరావు, రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జెఎసి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం

ప్రజాశక్తి - వీరఘట్టం

లక్షలాది ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలను అనుకూలంగా నిలబడి పోరాటం చేయవలసిన ఎపి జేఏసీ ప్రభుత్వ నుండి ఎలాంటి స్పష్టత సాధించకుండానే ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ పిలుపును వాయిదా వేయడాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు వ్యతిరేకించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ జిఎల్ఐ, పీఎఫ్ తదితర ఆర్థిక బకాయిలు రూ.20 వేల కోట్లు ప్రభుత్వం నుంచి ఏ విధమైన స్పష్టత ఇవ్వకుండా ఎలా వాయిదా వేశారన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేయడం సభవు కాదని ఆయన అన్నారు.

'ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం'

ప్రజాశక్తి-పాలకొండ

ఎఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని, అందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని వస్తామని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకులు డి.సాయిప్రసాద్, మురళి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. ఆదివారం స్థానిక రామ డిగ్రీ కళాశాల ఆవరణలో హెల్త్ కార్యదర్సులతో ఢిల్లీశ్వరీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సచివాలయంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వీటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. డ్యూటీ సమయం సరిదిద్దాలని, యాప్స్ భారం తగ్గించాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు ఝాన్సీ, ప్రభావతి, పలువురు ఎఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సాయిప్రసాద్

కుడ్డపల్లి.. అభివృద్ధి లోగిలి

- మౌలిక వసతుల కల్పనలో ముందంజ
- గిరిజనాభివృద్ధికి కృషి చేస్తున్న సచివాలయ సిబ్బంది
- ఉత్తమ కార్యదర్శిగా పాపారావుకు ప్రశంసలు

కుడ్డపల్లి... సీతంపేట ఏజెన్సీలో ఓ పంచాయతీ. 15 గ్రామాలకు కేంద్రంగా ఉన్న మారుమూల గిరిజన పంచాయతీ ఇది. అయితేనేం, అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తోంది. గిరిజనాభివృద్ధిలో సచివాలయ సిబ్బంది చేస్తున్న కృషే అందుకు కారణం. అందులో పంచాయతీ కార్యదర్శి యాగాటి పాపారావు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గిరిజనులకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. రెండేళ్ల క్రితం యాగాటి పాపారావు.. పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిరంతరం కుడ్డపల్లి పంచాయతీ ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకొంటున్నారు. తన చేతిలోని ఉన్న సమస్యను వెంటనే పరిష్కరిస్తున్నారు. లేదంటే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. దీంతో అభివృద్ధి పథంలో కుడ్డపల్లి దూసుకుపోతోంది.

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో 31 సచివాలయాల పరిధిలో 53 పంచాయతీలు ఉన్నాయి. అందులో కుడ్డపల్లి పంచాయతీలో 2918 మంది గిరిజనులు నివశిస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలో 15 గ్రామాలు ఉన్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వచ్చిన నిధులతో పక్కా ప్రణాళికతో రహదారులు వేయడానికి పంచాయతీ కార్యదర్శి వై.పాపారావు ఆధ్వర్యాన సిబ్బంది తనవంతు కృషి చేశారు. ఉపాధి హామీలో రహదారులు వేయడంలో పంచాయతీ కార్యదర్శి కీలకపాత్ర పోషించారు. పాలమానుగూడ, వల్లగజ్జి, అమ్మచెరువు,

పారిశుధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి పాపారావు

బందమానుగూడ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే, మోటార్లు తవ్వించి ఇంటింటికీ పైప్‌లైన్ వేసి తాగునీరు అందించారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి వచ్చేటట్లు చర్యలు చేపట్టారు. ఆ పంచాయతీలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచారు. దోమల నివారణకు దగ్గరుండి సింథటిక్ ఫైర్ తాయిడ్ ఫాగింగ్ చేయించారు. పంచాయతీలో ఇంటి పన్ను వసూలు లక్ష్యం రూ.35,210 కాగా, ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నుంచి వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారు. 25 కిలోల వర్మీకంపోస్టును రూ.2500 కు విక్రయించి పంచాయతీకి ఆదాయాన్ని తెచ్చిపెట్టారు. అక్కడితో ఆగకుండా ప్లాస్టిక్ 15 కేజీలు సేకరించి రూ.1500 విక్రయించి అదనపు ఆదాయాన్ని తీసుకువచ్చారు. ఇప్పటికే పంచాయతీ పరిధిలో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల నూతన భవనాలు పూర్తయ్యి, అందుబాటులోకి వచ్చాయి. సచివాలయ భవనం పనులు కూడా పూర్తయ్యాయి.

కార్యదర్శి సేవలకు ప్రశంసలు

గిరిజనుల మధ్య ఉంటూ, ఉత్తమ సేవలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి పాపారావుకు పురస్కారాలు దక్కాయి. రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ కార్యదర్శిగా వై.పాపారావుకు ఐటిడిఎ పిఒ కల్పనకుమారి ప్రశంసాపత్రం అందజేశారు. గతంలో ఇదే మండలంలో పులిపుట్టి కార్యదర్శిగా పాపారావు ఉత్తమ సేవలు అందించడంతో అప్పటి కలెక్టర్ ధనుంజయ రెడ్డి, ఐటిడిఎ పూర్వ పిఒ ఎల్.శివశంకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సచివాలయ పరిధిలో సేవలందిస్తున్న వాలంటీర్లలో ఇద్దరికి సేవా వజ్ర పురస్కారాలు రావడం గమనార్హం.

స్ప్రేయింగ్ దగ్గరుండి చేస్తున్న కార్యదర్శి పాపారావు

పంచాయతీ కార్యదర్శి పాపారావుకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఐటిడిఎ పిఒ శివశంకర్(ఫైల్)

ఆగిపోయిన బస్సు వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గోతిలో దిగిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గోతుల్లో ఆర్‌టిసి బస్సు దిగిపోయింది. ఆదివారం పార్వతీపురం నుంచి కొమరాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు కొమరాడ వద్ద గల రహదారిపై ఏర్పడిన భారీ గోతిలో నిలిచిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో బస్సు రహదారిపై అడ్డుగా ఉండిపోవడంతో భారీ ట్రాఫిక్ ఏర్పడింది. ట్రాఫిక్ అంతరాయంలో ఇరుక్కుపోయి తీవ్ర అవస్థలు పడ్డారు. మండలంలో పలుచోట్ల ఏర్పడిన భారీగోతుల్లో వాహనాలు నిలిచిపోవడంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ ఏర్పడుతుంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించడం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే గోతులు ఏర్పడిన ప్రదేశాల్లో రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం సరికాదు : సిపిఎం

రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికుల ప్రయాణాలతో ప్రభుత్వం అధికారులు చెలగాటం ఆడడం జరగాదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గోతులు నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు వద్దకు సిపిఎం నాయకులు చేరుకొని వాహనదారులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ అనేక దఫాలుగా రోడ్లు మరమ్మతులు చేపట్టాలని నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నప్పటికీ కనీసం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ప్రతిరోజు ఏదో ఒకచోట రహదారిపై ఉన్న గోతుల వద్ద భారీ వాహనాలు నిలిచిపోతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం ఈ రహదారిలో వేల సంఖ్యలో వాహనాలు పెరుగుతున్నాయని ఒక క్షణం వాహనాలు నిలిచిపోయిన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఇంత జరుగుతున్న అధికారులకు ప్రభుత్వానికి కనీసం సిఎం కుట్టినట్టు కూడా లేకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గోతులను కపాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, వాహనదారులు ప్రజలు పాల్గొన్నారు.

టిడిపి-జనసేన పొత్తు చారిత్రాత్మకం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా టిడిపి, జనసేన పొత్తులను మనస్ఫూర్తిగా ప్రజలు కోరుకుంటున్నారని అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి, జనసేన ప్రకటించిన ప్రతి అభ్యర్థులపై ఇరు పార్టీలు ఎంతో నమ్మకం ఉంచాయని అన్నారు. టిడిపి, జనసేన పొత్తులకు ప్రజామోదం ఉందని, రాష్ట్రంలో కోటీ మూడు లక్షల 33 వేల మందికి పైగా ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని ఈ జాబితాను సిద్ధం చేశారని అన్నారు. దేశ, రాజకీయ చరిత్రలో ఇప్పటివరకు బహుజనులకు ఏ పార్టీ ఇవ్వనని సీట్లను తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇచ్చాయన్నారు. ఈ తొలి జాబితాలో అభ్యర్థుల్లో గెలుపుపై మరింత ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. కొత్త జాబితాలో 23 మందికి కొత్త వారికి సీట్లు కేటాయించారని, 99 సీట్లలో 15శాతం సీట్లు మహిళలకు కేటాయించడం జరిగిందని, మాదిగ సామాజిక వర్గం నుంచి 11 మందిని, మాల సామాజిక వర్గం నుంచి 8మంది నేతలకు ప్రాతినిధ్యం కల్పించిందన్నారు. చదువుకున్న వారికి ఈ జాబితాలో ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని, ఈ జాబితాలో 63మంది అభ్యర్థులు పట్టభద్రులు ఉన్నారని, ముగ్గురు అభ్యర్థులు వృత్తిరీత్యా వైద్యులని, ఒక అభ్యర్థి ఐఎఎస్ అధికారి అని, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే నాయకులను కూటమిగా ఎంపిక చేసిందని అన్నారు. మరోవైపు చూస్తే తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల జాబితా సంచలనం రేపుతోందని టిడిపి అభ్యర్థుల జాబితాను చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలైందని అన్నారు. వైసిపికి ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీసం అభ్యర్థులు దొరకడం లేదని, వైసిపి ప్రకటించిన ఇన్చార్జీలు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కారు అన్న జగన్ వ్యాఖ్యలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి అణగదొక్కిన ఎస్సీలను ఈ జాబితాలో సముచిత స్థానం కల్పించామన్నారు. మొత్తంగా ఎస్సీలకు ఈ జాబితాలో 19మంది సీట్లను ఇచ్చామని గర్వంగా చెప్పుకుంటున్నామని తెలిపారు.

కలిసికట్టుగా పనిచేస్తాం... జగదీశ్వరిని గెలిపిస్తాం : కృష్ణబాబు

కలిసి కట్టుగా పనిచేసి కురుపాం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరిని గెలిపిస్తామని టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాలే తమకు శిరోధార్యమన్నారు. రాజుల పాలనకు చెక్ పెట్టి స్వచ్ఛమైన గిరిజన అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకునే అవకాశం వచ్చిందన్నారు. అరుకు పార్లమెంట్ పరిధిలో నాలుగు లక్షల ఓటు బ్యాంకు ఉన్న కొండదొర సామాజిక వర్గానికి ఎంపి టికెట్ తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీచర్లను భయబ్రాంతులకు గురిచేయొద్దు

ప్రజాశక్తి - కొమరాడ

టీచర్లకు నోటీసులిచ్చి భయభ్రాంతులు చేయడం మానుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న తమ సమస్యలపై శాంతియుతంగా చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లాలనుకుంటున్న ఉపాధ్యాయులకు పోలీస్ శాఖ వారు పాఠశాలలకు వెళ్లి నోటీసులు ఇచ్చి ముందస్తుగా భయభ్రాంతులను చేయడం చాలా అన్యాయమని అన్నారు. ఈరోజు ఉపాధ్యాయులే కాదు అంగన్వాడీ, ఆశా వర్కర్లకు కూడా గతంలో ఇంటి వద్ద నిర్బంధన అక్రమ అరెస్టులు చేశారన్నారు. వీటిపై భవిష్యత్తులో అన్ని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ లాంటి సందర్భంలో ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి ప్రజాసంఘాలు పూర్తిగా మద్దతు ఉంటుందని నాయకులు అన్నారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకుడు లక్షము, ఎపి రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు ఉన్నారు.

ఎమ్మెల్యేపై బురద జల్లడం సరికాదు

ప్రజాశక్తి - పాలకొండ

రెండు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న విశ్వసరాయి కళావతి నీతివంతమైన పాలన అందిస్తున్నారని, అటువంటి వ్యక్తిపై కొంత మంది బురదచల్లుతున్నారని ఎపి ఎన్జీవో డివిజన్ గౌరవ అధ్యక్షులు, వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎద్దు లిల్లీపుష్పనాథం అన్నారు. ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పదేళ్లుగా ఎమ్మెల్యే ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, వాటిని గుర్తుంచుకోవాలని అన్నారు. పట్టణంలో సుమారు రూ.60 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.3 కోట్లు నిధులను ప్రభుత్వం నుంచి తీసుకొచ్చారన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటులో కూడా అనేక ప్రయత్నాలు చేస్తున్నారని, టీడీ పారాపురం దగ్గరకు డంపింగ్ యార్డ్ మార్చేందుకు ఆమె చేసిన ప్రయత్నాలు తెలుసుకోవాలని అన్నారు. కొంత మంది వ్యక్తులు ఇష్టానుసారంగా ఆరోపణలు చేసి బురదచల్లడం సరి కాదన్నారు.

బలిజిపేట : బర్లిలో టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బేబినాయన, విజయచంద్ర



సీతంపేటలో వైసిపి నాయకులకు టిడిపి కండువా వేసి ఆహ్వానిస్తున్న జయకృష్ణ

టిడిపిలో భారీ చేరికలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని బర్లిలో ఆదివారం వైసిపి నుండి టిడిపిలోకి పెద్దసంఖ్యలో చేరికలు జరిగాయి. గ్రామానికి చెందిన ఎగిరెడ్డి నారాయణ రావు (నాని) అధ్యక్షతన ఆ గ్రామ సర్పంచ్ గులిపల్లి అప్పల నాయుడుతో పాటు సుమారు వంద కుటుంబాలు, అజ్జాడలో వైసిపి నాయకులు అక్కేన యల్లన్నాయుడు, ఇతర కుటుంబాలు బొబ్బిలి టిడిపి అభ్యర్థి బేబీనాయన, పార్వతీపురం టిడిపి అభ్యర్థి బోనెల విజయ చంద్ర సమక్షంలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా బేబి నాయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన ప్రభుత్వం నుంచి బయటకు రావడం. టిడిపిలో చేరడం మంచిదన్నారు. భారీగా చేర్పులు జరగడం వైసిపి అసమర్థత అని అన్నారు. టిడిపి, జనసేన నాయకులు ఐక్యమై ఎమ్మెల్యేగా విజయచంద్రను గెలిపించాలని, తనను కూడా ప్రజల సహకారంతో బొబ్బిలి నుండి గెలిపించాలని కోరారు. అనంతరం విజయచంద్ర మాట్లాడుతూ బర్లి గ్రామానికి జరిగిన అవమానానికి రెండింతలు తీరుస్తానని అన్నారు. పాముకి కోరల్లో విషముంటే ఎమ్మెల్యే జోగారావుకు ఒళ్లంతా ఉందని ఆరోపించారు. బర్లిలో పిహెచ్‌సి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బాబు పాలూరు. టిడిపి మండల అధ్యక్షులు పి.వేణుగోపాలనాయుడు, నాయకులు వెంకటనాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బాబ్జి, రాంబాబు, తదితరలు పాల్గొన్నారు

70 కుటుంబాలు టిడిపిలో చేరిక

సీతంపేట: మండలంలోని కెపి ఈతమానుగూడకు చెందిన సవర చంద్రయ్య, సవర మంగయ్య, సవర కూర్మారావు, సవర చిన్నారావు, సవర ఈశ్వరరావు, సవర గోపాలరావు, సవర మంగయ్య, సవర మజ్జయ్య, సవర చంద్రమ్మ, సవర సుశీల, సవర బంగారమ్మ చెందిన 70 కుటుంబాల నాయకులు, కార్యకర్తలు టిడిపి పాలకొండ నియోజకవర్గం నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని తెలుగుదేశం పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సవరతోట మొఖలింగం, సీనియర్ నాయకులు నిమ్మక నాగేశ్వరరావు, పాలక ఆదినారాయణ, ఐటిడిపి కోఆర్డినేటర్ ఈమరక పవన్, తెలుగు యువత అధ్యక్షులు సవర సంతోష్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నిమ్మక చంద్రశేఖర్, సింహాద్రి, మండల నాయకులు పాల్గొన్నారు.

పెంట గ్రూపు రహస్య సమావేశం

ప్రజాశక్తి - మక్కువ

టిడిపి సాలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత సంధ్యారాణి తీరుపై నిరసిస్తూ ఆమె వ్యతిరేక గ్రూపు సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. టిడిపి మాజీ మండల అధ్యక్షులు పెంట తిరుపతిరావు ఆధ్వర్యంలో 21 పంచాయతీ లకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. గత ఏడాది కాలంగా వీరంతా పోలీట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణికి దూరంగా ఉంటునే పార్టీ కార్టీ కార్యక్రమాలు వేరుగా నిర్వహిస్తున్నారు. టిడిపి అభ్యర్థిగా సంధ్యారాణి పేరు ప్రకటించడంతో ఈ రహస్య సమావేశానికి ప్రాధాన్యత సంతరించు కుంది. ఈనెల 27న బహిరంగ సభ నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణపై ప్రకటన చేయనున్నట్లు తెలుస్తుంది. ఈ సమావేశంలో శంబర ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, సర్పంచులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1982-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు వాకాడ నాగేశ్వరరావు, తేలు స్వామి నాయుడు, తిరుమలరావు మాట్లాడుతూ ఈ బ్యాచ్ విద్యార్థులందరూ ప్రతి సంవత్సరం కలుసుకుని తాము చదివిన పాఠశాలలో సేవా కార్యక్రమాలు ద్వారా కష్టనష్టాల్లో ఉన్న తమ స్నేహితులను ఆదుకుంటామన్నారు. అనంతరం కొత్త కమిటీ ఎన్నికున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డి.నారాయణరావు, జి. వెంకటరమణ, స్వర్గాల రమణ, ఎం. ప్రభాకర్, జగదీష్, జి వెంకట నాయుడు, టి శ్రీనివాసరావు, ప్రమేల, ఎస్ జయఉషారాణి, స్వర్ణలత, పి. కృష్ణమ్మ, సుజ్ఞా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కలిసిన పాత స్నేహితులు

ప్రణాళికా బద్ధంగా చదవాలి

బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి - సీతంపేట

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవాలని, అప్పుడే ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు కూడా సాధించవచ్చునని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక కెజిబివి పాఠశాలను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థినిలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పరీక్షా సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా సిబ్బంది, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆహారపు అలవాట్లు పాటిస్తూ అనారోగ్యానికి గురి కాకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మద్యానికి బానిసై ఒక గిరిజన యువకుడు శనివారం అర్ధరాత్రి మద్యం మత్తులో మందు అనుకుని పురుగు మందు తాటి మృతి చెందాడు. మండలంలోని పి.ఆమిటి పంచాయతీ, కారివలస గ్రామానికి చెందిన మండంగి రమేష్ (38) ప్రతిరోజు మద్యం సేవిస్తుండేవాడు. ప్రతిరోజు లాగే శనివారం కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అయితే తన భార్య సుహాసిని మద్యం సేవించడం ఆపాలని కోరగా మరల మద్యం తాగి, ఆ మద్యం మత్తులో పురుగుమందును కూడా సేవించాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రమేష్‌ను శనివారం రాత్రి భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. ఆసుపత్రి సిబ్బంది పరీక్ష చేయగా మధ్యలోనే రమేష్ మృతి చెందినట్లు చెప్పారు. రమేష్‌కు భార్యతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

గుమ్మలక్ష్మీపురం మండలంలోని బుడ్డిమ్మఖర్జ గ్రామం సమీపంలో ఉన్న మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొని ముగ్గురు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని దురిబిలికి చెందిన టి.హినత్, తులసి భార్య భర్తలిద్దరూ స్వగ్రామం నుంచి వెళ్తుతున్నారు. గొటివాడకు చెందిన కె.చంటి, సంతోష్ ద్విచక్ర వాహనంతో ఎదురుగా వస్తున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వస్తూ బుడ్డిమ్మఖర్జీ సమీపంలో ఢీ కొన్నారు. గాయపడిన ముగ్గురుని స్థానికులు కురుపాం సిహెచ్‌సికి తరలించారు. క్షతగాత్రులకు వైద్యసిబ్బంది చికిత్స అందించి, పోలీసులకు సమాచారం అందించారు.